క్లుప్తంగా

రక్త పింజర పాము పట్టివేత



రక్త పింజర పామును పట్టుకున్న క్రాంతి

జంగారెడ్డిగూడెం: స్థానిక లక్ష్మీ ఆసుపత్రి సమీపంలో రక్త పింజర (పొడ పాము)ను స్నేక్ సేవియర్స్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి చాకచక్యంగా పట్టుకున్నారు. లక్ష్మి హాస్పిటల్ పక్కన కురగంటి కళ్యాణ్ తన ఇంటి సెకండ్ ఫ్లోర్ మెట్ల పైకి ఎక్కుతున్న మూడున్నర అడుగులు, ఐదు కేజీలు బరువు గల పొడ పాము (రక్త పింజర)ని గుర్తించాడు. ఒక్కసారిగా భయ భ్రాంతులకు గురైన కళ్యాణ్ సమీపంలో ఉన్న స్నేక్ సేవియర్స్ సొసైటీ సంస్థకు సమాచారం అందించారు. వెంటనే సంస్థ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి సమీపానికి చేరుకుని పాముని పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

ముత్యాలమ్మకు అభిషేకాలు



విశేష అలంకరణలో ముత్యాలమ్మ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ముత్యాలమ్మ వారికి శుక్రవారం సందర్భంగా ఆలయంలోని ఉత్సవ విగ్రహానికి, అనంతశ్వరస్వామి వారికి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం నిర్మాణ కర్తలు బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మ కుమారి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కె.విజయ్ వినయ్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి మూల విరాట్‌కు 22 రకాల వివిధ రకాల హారతులిచ్చారు. అమ్మవారి దర్శించుకున్న వారిలో ఎర్ర నాగేశ్వరావు, సత్య దంపతులు, చోడవరపు రంగా, జ్యోతి, ఊటుకూరు నగేష్, రామబ్రహ్మం, పెయింట్ శ్రీను, పితాని సూర్యప్రకాష్ దంపతులు, ముత్యాలమ్మ, మంగ, దువ్వ రామకృష్ణలు ఉన్నారు.

శ్రీదేవి ల్యాబ్ అధినేత ఈశ్వర్ మృతి



ఈశ్వర్

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీదేవి ల్యాబ్ అధినేత ఈశ్వర్ (70) శుక్రవారం గుండె పోటుతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన గత నాలుగు దశాబ్దాలకు పైగా ల్యాబ్ నిర్వాకులుగా, ఆర్ఎంపీగా సేవలు అందించారు. మండలంలోని లక్కవరానికి చెందిన ఈశ్వర్ స్థానికంగా శ్రీదేవి ల్యాబ్ పేరుతో వేలాది మందికి వైద్య సేవలు అందించారు. పట్టణ ప్రముఖులుగా సేవా తత్పరుడిగా గుర్తింపు పొందారు. మానవత సంస్థ సభ్యుడిగా గతంలో రోటరీ సభ్యుడిగా సేవలు అందించారు. పలువురు ప్రముఖులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోలవరం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలవరం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి కృష్ణంరాజు సూచించారు. పోలవరం మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాతావరణంలో మార్పులకు వాంతులు, విరేచనాలు, డయేరియా కేసులు అక్కడక్కడా నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పారిశుభ్రత కూడా పాటించాలని సూచించారు. అనారోగ్యం ఏర్పడితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలని తెలిపారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

బుట్టాయగూడెం: గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేయాలని పీవైఎల్ డివిజన్ కార్యదర్శి, సహాయ కార్యదర్శులు గురుగుంట్ల ప్రసాద్ రెడ్డి, తగరం బాబూరావులు కోరారు. మండలంలోని మారుమూల గ్రామమైన మంగయ్యపాలెంలో శుక్రవారం కెచ్చెల పోతిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాకాలంలో గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేక ఫ్యాన్‌లు తిరగక దోమకాటుకు గురై గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. దోమ కాటుల వల్ల జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బుట్టాయగూడెం సమీపంలో ఉన్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కట్టం నాగేశ్వరరావు, కొమరం నాగార్జున, కె.నడిపిరాజు, గరిసికూటి లక్ష్మణరావు, నడపాల ముక్కారెడ్డి, గురుగుంట్ల బాబూరావు, మురళి, పూనెం రాము పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల సమస్యలపై వినతి



ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న సామాజిక కార్యకర్త పాషా



పుల్లేపు రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

టి.నరసాపురం: టి.నరసాపురం మండల పరిధిలోని ప్రధాన రహదారి మరమ్మతుల, ఇతర సమస్యలు పరిష్కరించాలని సామాజిక కార్యకర్త నాసర్ పాషా ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కోరారు. ఈ మేరకు బాలరాజు నివాసంలో ఎమ్మెల్యేకు నాసర్ పాషా వినతిపత్రం అందజేశారు. టి.నరసాపురం – చింతలపూడి ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రజలు అనునిత్యం చింతలపూడికి ఈ రోడ్డులోనే ప్రయాణించాల్సి ఉంటుందని, రహదారి అధ్వానంగా ఉండటంతో హైదరాబాద్ సర్వీస్ రద్దుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రయత్నం చేస్తుందని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గ పరిధిలో రోడ్డు అయినప్పటికీ ఎమ్మెల్యేగా ఈ రోడ్డు మరమ్మతులతో పాటు వెడల్పుకు కృషి చేయాలని కోరారు. టి.నరసాపురం, బందంచర్ల, గండిగూడెం, జీలుగుమిల్లి, బండివారిగూడెం, రుద్రకోట రాజుగూడెం ప్రధాన రహదారుల మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. టి.నరసాపురంలో ఇంకా మిగిలి ఉన్న డ్రెయినేజీ పనులు పూర్తి చేయడంతో పాటు గండిగూడెంలో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. చింతలపూడి – టి.నర్సాపురం రహదారిలోని గుర్రాజు గుంట వద్ద చింతలపూడి పంచాయతీ చెత్త డంపింగ్ నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇంకా పలు సమస్యలను వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అడపా నాగరాజు నవీన్, తేజ, టి.నరసాపురం గ్రామస్తులు మాదంశెట్టి ప్రభాకర్, తాతా రవి, బైగాని రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లేపు రోడ్డు అభివృద్ధి కోరుతూ ఆందోళన

టి.నరసాపురం: అధ్వానంగా ఉన్న పుల్లేపు రోడ్డు అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళి డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఆర్ నగర్ కూడలిలో కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పుల్లేపు రోడ్డు అభివృద్ధి లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు కొనసాగడం లేదన్నారు. బండివారిగూడెం సమీపంలో, పుల్లేపు ఊరగుంట చెరువు వద్ద కల్వర్టు నిర్మాణానికి రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వి వదిలేశారని తెలిపారు. ఆ గోతులు ప్రమాదకరంగా ఉండడంతో ఆర్టీసీ సర్వీసు కూడా రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధితో పాటు కల్వర్టులు త్వరితగతిన నిర్మించాలని కోరారు. ఈ ఆందోళనలో సీపీఎం కార్యకర్తలు బాణాల రామారావు, బరగడ కుమారి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల షాపుల్లో తనిఖీలు



జంగారెడ్డిగూడెంలోని ఓ షాపులో అధికారుల తనిఖీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులను మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ పోశారావు, కేఆర్‌పురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు, రాష్ట్ర స్థాయి విజిలెన్స్ తనిఖీ అధికారి జదీశ్వర్‌రెడ్డి, నాగరాజులు తనిఖీ చేశారు. స్వర్ణాంధ్ర రైతు సేవా కేంద్రం షాప్‌లో అనుమతులు లేని సూక్ష్మపోషకాల ప్యాకెట్లు రూ. 51,022 విలువ గల 137 కేజీలు నిల్వలు గుర్తించి, సీజ్ చేశారు. సూర్య సీడ్స్ విత్తన షాపులో ధ్రువీకరణ పత్రం లేని బెండ విత్తనాలు రూ.3,58,020 విలువ గల 234 ప్యాకెట్ల నిల్వలను గుర్తించి, వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. మండలంలో నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగుమందులు, ఎరువుల విక్రయిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారని రాష్ట్ర స్థాయి విజిలెన్స్ తనిఖీ అధికారులు హెచ్చరించారు.

అపరిశుభ్ర పరిసరాలు వ్యాధులకు ఆవాసాలు

ఏలూరు (టూటౌన్): అపరిశుభ్ర పరిసరాలు వ్యాధులకు ఆవాసాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. స్థానిక లంకపేట రెండవ రోడ్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వర్షాకాలంలో వర్షాల వల్ల కీటకాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ముఖ్యంగా దోమలు, ఈగలు ద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, అతిసారా, కామెర్లు, టైఫాయిడ్ మొదలగు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇంటి పరిసరాలు, పల్లపు ప్రాంతాలను మట్టితో పూడ్చుకోవాలని, సాధారణంగా మనం వాడే తొట్టెలు, డ్రమ్ములు, ఓవర్ ట్యాంక్‌లు వారానికి ఒకసారి కడిగి మూతలు పెట్టుకోవాలని సూచించారు. ఈగల అభివృద్ధి నిరోధానికి ఇంటి పరసరాల్లో చెత్త పోగులు, పేడ పోగులు పెట్టరాదని అన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.నిర్మల, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

దెందులూరు: హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే ఎంవీఆర్ యాక్ట్ ప్రకారం జరిమానా లేదా మోటార్ సైకిల్ సీజ్ చేస్తామని డీఎస్పీ జి.లక్ష్మయ్య హెచ్చరించారు. డీఎస్పీ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే సీజ్ చేయడంతో పాటు తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. వారం రోజులు పాఠశాలలు, కళాశాలలు, శిక్షణా కేంద్రాల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు అన్ని మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్సైలతో చర్యలు చేపట్టామని తెలిపారు.

శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడులు



కొమరవరంలో వెదజల్లే పద్ధతిపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామాలైన దుద్దుకురు, కొమరవరం గ్రామాల్లో శుక్రవారం ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు పరిధిలోని ఏరువాక కేంద్రం, ఏలూరు శాస్త్రవేత్తల వ్యవసాయశాఖ, రిలయన్స్ ఫౌండేషన్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వరి, పత్తి సాగులో సమగ్ర యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ వెదజల్లే వరిలో కలుపు, ఎరువుల యాజమాన్యం, వరిలో విత్తనశుద్ధి, ప్రత్తిపంటలో కలుపు, విత్తనశుద్ధి తదితర అంశాలను రైతులకు అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ వరహాలు మాట్లాడుతూ రైతులు వెదజల్లే వరి సాగులో ప్రతి పంటలో శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎస్ నాగేంద్రబాబు, గ్రామీణ వ్యవసాయ సహాయకురాలు కుమారి సుధ, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది రూపాస్, రైతులు పాల్గొన్నారు.

నూకాలమ్మ రజత వస్త్రానికి వెండి సమర్పణ



రజత వస్త్రానికి వెండిని సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారు ఆషాఢ అమావాస్య, శుక్రవారం సందర్భంగా విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కళ్యాణ కళావేదిక వద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీజలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి పూజలు అర్చకుడు మనోజ్ శర్మ నిర్వహించారు. అమ్మవారి రజత వస్త్రం తయారీకి పిండి దుర్గ, వారి కుమారులు సాయి శ్రీరామ్ చరణ్, భాను ప్రకాష్‌లు సంయుక్తంగా 15 తులాల వెండి, పసుపులేటి వెంకటేశ్వరావు, పద్మజ దంపతులు 5 తులాల వెండి, భీమవరం వాస్తవ్యులు వానపల్లి సూర్యనారాయణ, ధనలక్ష్మి దంపతులు 5 తులాల వెండి సమర్పించినట్టు ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు పట్టణ ప్రముఖులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ, ఆస్పత్రి నిర్మాణాలను పూర్తిచేయాలి



డిగ్రీ కాలేజీ భవనానఇన పరిశీలిస్తున్న సీతారామ్, తదితరులు

బుట్టాయగూడెం: మండలంలోని బుట్టాయగూడెం శివారులో అసంపూర్తిగా ఉన్న డిగ్రీ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర నాయకులు మంతెన సీతారామ్ ప్రభుత్వాన్ని కోరారు. సింగరంపాడు సమీపంలో ఉన్న డిగ్రీ కళాశాల, బుట్టాయగూడెం శివారులో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఆయన సందర్శించారు. ఈ రెండు నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు దిక్సూచిగా మారే అవకాశం ఉందని అన్నారు. ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేసి గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, డిగ్రీ కళాశాలకు అనుబంధ హాస్టల్‌కు అదనపు భవన నిర్మాణం చేపట్టి గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సీతారామ్ కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, పోలోజు నాగేశ్వరరావు, చుండ్రు బుల్లెమ్మ, అన్నిక వెంకటస్వామి, తాతి రాంబాబు, పూసం దుర్గారావు, రాజన్న, సోయం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మకు పల్లకీ సేవ



విజయదుర్గమ్మవారి పల్లకీసేవ

జంగారెడ్డిగూడెం: మాస శివరాత్రి సందర్భంగా స్థానిక విజయదుర్గమ్మవారి ఆలయంలోని శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి సన్నాయి మేళతాళాల నడుమ అత్యంత వైభవంగా ఊరేగించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు సుదర్శనం వేణుగోపాలాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పద్మావతి, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్లోని దివాకర్ స్వీట్ షాప్ యాజమాన్యం, ఆలయ కమిటీ వారి ఆర్థిక సాయంతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడ రామమోహనరావు, సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల యుగంధర్, ఉపాధ్యక్షుడు వందనపు అప్పలరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎర్రం ఉదయ్ కుమార్, సభ్యులు జెల్లెపల్లి శివకృష్ణ, దుసనపూడి ఏడుకొండలు, జోరీగే సాయిరాం, సురేష్, మహిళా కమిటీ అధ్యక్షురాలు మానేపల్లి రోహిణి, ఉపాధ్యక్షురాలు చిన్ని జయలక్ష్మి, యర్రం గీత, వందనపు బాలత్రిపుర సుందరి, పరిపూర్ణ, దూసనపూడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి



సినీనటుడు సుమన్‌కు వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ ఎదగాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. ఏలూరులో ఒక సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన సుమన్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు బీసీ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ బీసీలు అన్ని పార్టీల్లో ఉండాలని, ఇదే సమయంలో బీసీ కులాల్లో రాజకీయాలు ఉండకూడదని సూచించారు. బీసీలంతా కలిసికట్టుగా ఐక్యతతో పనిచేయాలన్నారు. బీసీలు ఏ రాజకీయ పార్టీలో ఉన్నా తమ హక్కులను పోరాడి సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. ప్రధానంగా విద్య, రాజకీయ, ఆర్థికంగా బీసీలు ఎదిగినప్పుడే బీసీలు అభివృద్ధి పథంలో పయనించేందుకు వీలు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా బీసీలకు చెందిన పలు సమస్యలపై ఆయన అనేక విషయాలను బీసీ నాయకులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, నూరు బాషా రాష్ట్ర అధికార ప్రతినిధి గాజుల బాజీ, సామాజిక కార్యకర్త చప్పిడి సత్యనారాయణ, యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఆర్ విఠల్ కుమార్, జిల్లా కన్వీనర్ పామర్తి యేసురాజు, తూర్పుకాపు సంఘం నాయకుడు అప్పిరెడ్డి రంగ ముత్యాలు, బాయి వెంకట్రావు, బోయిన కేదారేశ్వరరావు, కొత్తల శివకుమార్, నల్లపాటి రాజేష్, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

మేధా పాట్కర్‌పై శిక్షను రద్దుచేయాలి

ఏలూరు (టూటౌన్): ప్రముఖ పర్యావరణ వేత్త, నర్మదా బచావో నాయకురాలు మేధా పాట్కర్ పైన ఢిల్లీ కోర్టు విధించిన శిక్ష, భారీ జరిమానాను రద్దు చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మేధా పాట్కర్‌పై ఇటీవల ఢిల్లీ కోర్టు ఐదు నెలల జైలు శిక్ష, రూ.10 లక్షల భారీ జరిమానా విధిస్తూ తీర్పు నివ్వడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ తీర్పును ప్రజాస్వామిక వాదులు అందరూ తీవ్రంగా ఖండించాలని తెలిపారు. నర్మదా డ్యామ్‌లో మునిగిపోయే నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, పెద్ద ఎత్తున ఆందోళన చేసిన ఫలితంగా పునరావాస సమస్యను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చర్చకు తీసుకురావడంతో మేధా పాట్కర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఎవరో మెయిల్లో పంపించిన దానిపై ఆధారపడి గుజరాత్లో ఫైలైన కేసును ఢిల్లీకి మార్చుకుని 23 సంవత్సరాల తర్వాత ఆమెపై పైవిధంగా తీర్పు ఇవ్వడం బీజేపీ ఫాసిస్ట్ తరహా పాలనను తెలియజేస్తుందని వివరించారు. పునరావాసం కోసం గిరిజనులు, పేదల హక్కుల కోసం పోరాడే వారిపై కేసులు పెట్టడం, శిక్షలు విధించడం సరికాదని తెలిపారు. ప్రజాస్వామిక వాది అయిన అరుంధతి రాయ్‌పైనా 1400 పేజీల ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు పెట్టడానికి బీజేపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ప్రజల జీవించే హక్కును కూడా కాలరాస్తోన్న వారిపై ఏవిధమైన కేసులు, శిక్షలు విధించడం లేదని ఆరోపించారు.

ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



జాతీయ ప్రధాన రహదారిపై ఢీకొన్న లారీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక బుట్టాయగూడెం రోడ్డులోని జాతీయ ప్రధాన రహదారి ఎస్సార్ బంక్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ నుంచి విశాఖపట్టణానికి గ్రానైట్ లోడ్‌తో వెళుతున్న లారీ స్థానిక జాతీయ ప్రధాన రహదారి ఎస్సార్ పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేసరికి అశ్వారావుపేట వైపు వెళుతున్న లారీని ఢీకొంది. లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో గ్రానైట్‌లోడ్‌తో వెళుతున్న లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. గ్రానైట్ లోడ్ లారీ డ్రైవర్ పుల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు డ్రైవర్ పుల్లయ్యను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. మరో లారీ డ్రైవర్ ఎస్కే షంషుద్దీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో గ్రానైట్ రాళ్లు రోడ్డుపై పడటంతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు క్రేన్ల సాయంతో రెండు లారీలను, అడ్డంగా ఉన్న గ్రానైట్‌రాళ్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అవయవ దానంపై రేపు సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన అవయవదానంపై నగరంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొంటారని పేర్కొన్నారు. స్థానిక పత్తేబాదలోని శ్రీసాయి రాధ మినీ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రకతదానం, నేత్రదానం, శరీర దానం, విద్యాదానం అనే అంశాలపై సైతం ఆమె అవగాహన కలిగిస్తారని, ప్రజలు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

బాలికల పాఠశాలలో ఎస్పీఎల్ ఎన్నికలు



ఎన్నికల తీరును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



ఓటరు వేలుపై సిరా చుక్క వేస్తున్న ఉపాధ్యాయుడు

ఏలూరు రూరల్ : ఏలూరు కస్తూరిబా ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్ఎం జి.సునీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ఎస్పీఎల్ ఎన్నికలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ చేపట్టే విధి విధానాల మాదిరిగా ఇక్కడా నిబంధనలు అమలు చేశారు. హెచ్ఎం 10 రోజుల ముందుగా ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్లు, డిపాజిట్ స్వీకరణ, ఉపసంహరణ, స్క్రూటినీ చేపట్టారు. తర్వాత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ప్రచారానికి అవకాశం కల్పించారు. తర్వాత పోలింగ్ నిర్వహించారు. ఓటర్లు మాదిరిగా విద్యార్థుల వేలుపై సిరా చుక్క వేసి ఎన్నికల ముగించారు. తర్వాత కౌంటింగ్ నిర్వహించి, గెలుపొందిన ఎస్పీఎల్‌తో హెచ్ఎం ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో విద్యార్థులు హర్షం వెలిబుచ్చారు.

నేడు శునకాలకు యాంటీ రేబీస్ టీకాలు

ద్వారకాతిరుమల: ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని స్థానిక పశువైద్యశాలలో శనివారం పెంపుడు శునకాలకు యాంటీ రేబీస్ టీకాలు వేస్తామని మండల పశువైద్యాధికారి అంగర సురేష్ తెలిపారు. ఈ టీకాలు వేయించడం వల్ల శునకాలు రేబీస్ వ్యాధి బారిన పడవని, అవి కరిచినా మనుషులకు ఆ వ్యాధి సోకదని పేర్కొన్నారు. పెంపుడు శునకాలకు తప్పకుండా ఈ టీకాలు వేయించాలని కోరారు. జి.కొత్తపల్లి పశువైద్యశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెంపుడు శునకాలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఎస్. రమేష్ కోరారు.

చేబ్రోలు పోలీసులకు రివార్డు

ఏలూరు (టూటౌన్): పేకాట కేసుకు సంబంధించి కోర్టు అందించిన రివార్డు సొమ్మును చేబ్రోలు పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఎస్పీ మేరీ ప్రశాంతి శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు. 2023, జనవరి 16న చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంగుటూరు మండలం కంసాలిగుంటలో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 23 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.8.45 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి 23 మంది ముద్దాయిలను 2023, డిసెంబరు 29న కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం వారికి రూ.300 చొప్పున జరిమానా విధించారు. ఈ కేసులో చేబ్రోలు పోలీస్ స్టేషన్ సిబ్బందికి కోర్టు రూ.1.65 లక్షల రివార్డు ఇచ్చింది. ఈ మేరకు చెక్కులను పోలీస్ సిబ్బందికి ఎస్పీ డి.మేరీ ప్రశాంతి శుక్రవారం అందజేశారు. నాటి చేబ్రోలు ఎస్సై స్వామి, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం శ్రీచక్ర అభిషేకం, సహస్రనామార్చన నిర్వహిస్తామని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు భక్తులచే సామూహికంగా కుంకుమ పూజ, అనంతరం పంచహారతులు, వేద మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. ఉత్సవాల ముగింపు రోజు ఈ నెల 15న ఉదయం 9.01 గంటలకు చండీ హోమ సహిత లలితా హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.